

మంత్రి పొన్నం ప్రభాకర్‌కు పుష్పగుచ్ఛాన్ని అందజేసి శుభాకాంక్షలు తెలియజేస్తున్న చిటకోరు కృష్ణ తదితరులు

## పొన్నం ప్రభాకర్‌ను కలిసిన యూత్ కాంగ్రెస్ నాయకులు

**ఫతేనగర్, జనవరి 18(ఆంధ్రజ్యోతి):** సంక్రాంతి పండుగ సందర్భంగా రాష్ట్ర రవాణాశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌ను యువజన కాంగ్రెస్ నాయకులు మర్యాద పూర్వకంగా కలిశారు. కూకట్‌పల్లి నియోజకవర్గ యూత్ కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు చిటకోరు కృష్ణ ఆధ్వర్యంలో పలువురు నాయకులు మంత్రి నివాసానికి వెళ్ళి ఆయనకు పుష్పగుచ్ఛాన్ని అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. రవూఫ్, అరుణ్, రతికాంత్, అరుణ్‌సింగ్, రామారావు, ఏడుకొండలు మంత్రిని కలిసారు.

## బల్మూరి వెంకట్‌కు శుభాకాంక్షలు..



బల్మూరి వెంకట్‌ను కలిసిన గొల్ల జాన్

**షాపూర్‌నగర్, జనవరి 18 (ఆంధ్రజ్యోతి):** తెలంగాణ అసెంబ్లీలో కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్సీ అభ్యర్థిగా నియమితులైన ఎన్ఎస్‌యూఐ రాష్ట్ర అధ్యక్షులు బలుమూరి వెంకట్‌ను ఎన్ ఎస్ యూఐ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గొల్ల జాన్ గురువారం మర్యాద పూర్వకంగా కలిసి శుభా కాంక్షలు తెలియజేశారు. ఈసందర్భంగా జాన్ మాట్లాడుతూ 2014లో తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తరువాత టీఆర్ఎస్ పార్టీ నిరుద్యోగులను, విద్యార్థులను మోసం చేసిందన్నారు. కాంగ్రెస్ పార్టీ విద్యార్థి విభాగం తరుపున విద్యార్థుల కోసం వారి పక్షాణ పోరాడుతూ , పోలీస్‌ల లాఠీ దెబ్బలు తిని, కేసులు , జైలు పాలై తెలంగాణాలో 2024లో కాంగ్రెస్ పార్టీ గెలి చిన తరువాత మా పోరాటాన్ని గుర్తించి యువకునిగా బలుమూరి వెంకట్‌కు ఎమ్మెల్సీగా అవకాశం ఇచ్చిన కాంగ్రెస్ పార్టీకి, అధిష్టానానికి కృతజ్ఞతలు తెలిపారు.

## సకాలంలో ఆస్తి పన్ను చెల్లించాలి

**దుండిగల్, జనవరి 18(ఆంధ్రజ్యోతి):** దుండిగల్ మున్సిపాలిటీ పరిధిలో పన్ను వసూళ్లలో భాగంగా గాగిల్లాపూర్ వార్డులోని వివ్యాక్స్ కంటెన్నెస్ కంపెనీ వారు రూ.5 లక్షల 30 వేల 880లను గురువారం చెల్లించారు. దానికి సంబంధించిన చెక్కును కంపెనీ నిర్వహకులు కమిషనర్ కె.సత్యనారాయణరావుకు అందజేశారు. కమిషనర్ మాట్లాడుతూ.. ప్రతీ ఒక్కరూ సకాలంలో ఆస్తి పన్ను చెల్లించి మున్సిపల్ అభివృద్ధికి తోడ్పడాలన్నారు. అదే విధంగా వ్యాపారం చేసే వారంతా ట్రేడ్‌లైసెన్స్ చెల్లించి మున్సిపల్ అభివృద్ధికి తోడ్పడాలని కోరారు. కార్యక్రమంలో రెవెన్యూ అధికారి సునంద, బిల్ కలెక్టర్లు సుజాత, భిక్షపతి ఉన్నారు.



ఆటో డ్రైవర్ల సమావేశంలో మాట్లాడుతున్న ఉమా మహేష్

## ఆటో డ్రైవర్లను ప్రభుత్వం ఆదుకోవాలి

**పేట్‌బషీరాబాద్, జనవరి 18(ఆంధ్రజ్యోతి):** ఆటో డ్రైవర్లను కాంగ్రెస్ ప్రభుత్వం ఆదుకోవాలని కుత్బుల్లాపూర్ సీపీఐ కార్యదర్శి ఉమామహేష్ అన్నారు. రంగారెడ్డినగర్ డివిజన్ గాంధీనగర్ పారిశ్రామిక వాడలోని ఏఐటీయూసీ కార్యాలయంలో ఐడీపీఎల్ నుంచి గండి మైసమ్మ వరకు నడిపించే ఆటో డ్రైవర్లతో సమావేశం నిర్వహించారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం వల్ల ఆటో డ్రైవర్లకు ప్రయాణికులు తగ్గారని, ఫైనాన్స్ డబ్బులు కూడా కట్టలేకపోతున్నారని ఉమామహేష్ అన్నారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ నియోజకవర్గ అధ్యక్షుడు హరినాథ్, ఆటో యూనియన్ అధ్యక్షులు ప్రవీణ్, రాజు, తదితరులు పాల్గొన్నారు.

## మేకలదొడ్డిలో కట్టేసిన మేకలు మాయం..

- పోలీసులకు ఫిర్యాదు చేసిన యజమాని

**దుండిగల్, జనవరి 18(ఆంధ్రజ్యోతి):** బౌరంపేట గ్రామంలో ఒక వ్యక్తికి చెందిన పొట్టేళ్లు, గొర్రెలు, మేకలు అదృశ్యమవడంతో వాటి యజమాని పి. రమేష్ గురువారం దుండిగల్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. బౌరంపేటకు చెందిన రమేష్ గొర్రెలను మేపుకుంటూ జీవిస్తున్నాడు. ఆరు గొర్రె పొట్టేళ్లు, ఒక మేక, ఒక పోతు, పదిహేడు గొర్రెలు ఉన్నాయి. వీటిని దుండిగల్ మండలంలోని బౌరంపేటలో ప్రతి రోజూ ఖాళీ ప్రదేశంలో మేపుతూ, వాటిని గ్రామంలోని కోమటికుంట చెరువు వెనకాల ఉన్న మేకల దొడ్డిలో తోలి రమేష్ ఇంటికి వెళుతుంటాడు. ఇలా ఎనిమిది సంవత్సరాల నుంచి వ్యవసాయం చేసుకుంటూ వాటిని పెంచుతున్నాడు. రోజూ మాదిరిగానే గురువారం ఉదయం 5 గంటలకు మేకల దొడ్డికి వెళ్లి చూడగా గొర్రెలు కనిపించలేదు. వాటి కోసం రెండు గంటల సేపు చుట్టు పక్కల వెతికినా ఫలితం కనిపించలేదు. గొర్రెలు కనిపించక పోవడంతో వాటిని దొంగలు తోలుకొని పోయి ఉండవచ్చునని, దీనిపై దుండిగల్ పోలీసులకు రమేష్ ఫిర్యాదు చేశాడు.

## ఫుట్‌పాత్‌ల ఆక్రమణలకు పాల్పడితే కఠిన చర్యలు

**షాపూర్‌నగర్, జనవరి 18(ఆంధ్రజ్యోతి):** కుత్బుల్లాపూర్ నియోజకవర్గం పరిధి ప్రధాన రహదారుల్లో ఫుట్‌పాత్‌ల ఆక్రమణలపై సీపీ ఆదేశాల మేరకు గురువారం తొలగించినట్లు జీడిమెట్ల ట్రాఫిక్ సీఐ వెంకట్‌రెడ్డి తెలిపారు. ఐడీపీఎల్, రంగాథియేటర్ చౌరస్తా, ఉషాముళ్లపూడి చౌరస్తాల్లో ఫుట్‌పాత్‌ల ఆక్రమణలు జీహెచ్ఎంసీ వారి సహకారంతో తొలగించామన్నారు. షాపూర్‌నగర్ రంగా థియేటర్ వద్ద సుమారు 100 అడుగులు ఆక్రమించి ఎన్నో ఏళ్లుగా వ్యాపారాలు సాగిస్తున్న వారిని ఖాళీ చేయించామన్నారు. వ్యాపారులు ఫుట్‌పాత్‌లపై వ్యాపారాలు చేయవద్దని, ఆక్రమణలకు పాల్పడితే శాశ్వతంగా తొలగిస్తామని అన్నారు.

## సఫాయి కార్మికుల ఇళ్లు శుభ్రం

**హైదరాబాద్ సిటీ, జనవరి 18 (ఆంధ్రజ్యోతి):** సంక్రాంతి పండుగ సందర్భంగా విప్రో కన్స్యూమర్ మాక్స్‌క్లీన్ ఆధ్వర్యంలో ఇంటి పనిమనుషుల ఇళ్లలో సఫాయి క్యాంపెయిన్ పేరుతో పరిశుభ్రత కార్యక్రమాన్ని నిర్వహించింది. దాదాపు పది రోజుల పాటు హైదరాబాద్‌లోని పలు ప్రాంతాల్లో ఈ కార్యక్రమాన్ని పూర్తి చేసినట్లు నిర్వాహకులు తెలిపారు. ఇళ్లలో పనిచేసే వారు పండుగ సమయాల్లో కూడా ఇతర ఇళ్లలో పరిశుభ్రతకే సమయం కేటాయిస్తారని, తమ ఇళ్ల విషయాలను పెద్దగా పట్టించుకోరని నిర్వాహకులు తెలిపారు. అలాంటి వారి ఇళ్లలో పరిశుభ్రం చేశామని సంస్థ జనరల్ మేనేజర్ ఉషాసిస్సాహా తెలిపారు.

## 21న తిరుమలకు మహాపాదయాత్ర

**కూకట్‌పల్లి, జనవరి 18 (ఆంధ్రజ్యోతి):** గడపగడపకు గీత గోవిందుడు, గోవు లక్ష్యసాధన ఫౌండేషన్ సంయుక్త ఆధ్వర్యంలో ఈనెల 21వ తేదీ నుంచి తిరుమలకు మహాపాదయాత్ర పేరుతో కార్యక్రమం ప్రారంభించనున్నారు. మహాపాదయాత్రకు సంబంధించిన పోస్టర్లను గురువారం కూకట్‌పల్లిలోని రామాలయం వద్ద ఆవిష్కరించారు.

పాదయాత్రలో పాల్గొనే భక్తులు కూకట్‌పల్లి నుంచి తిరుమలకు నడుచుకొంటూ వెళ్లనున్నారు. 40 రోజులు పాటు సాగే పాదయాత్రలో 40 గ్రామాల్లో గీత, గోవిందుడు, గోవు సంరక్షణ అంశాలపై ప్రజల్లో అవగాహన కల్పించనున్నట్లు నిర్వాహకులు శ్రీమాన్ భైలూర్ యోగీష్ ప్రభు తెలిపారు.

## ప్రభుత్వ భూమిని ఆక్రమించిన వారిపై చర్యలు తీసుకోవాలి

**చందానగర్, జనవరి 18 (ఆంధ్రజ్యోతి):** ప్రభుత్వ భూమిని ఆక్రమించిన గుర్తుతెలియని వ్యక్తులపై చర్యలు తీసుకోవాలని శేరిలింగంపల్లి మండల రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ ఫిర్యాదు చేసిన సంఘటన గురువారం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... స్టేషన్ పరిధిలోని గోపన్‌పల్లి సర్వేనెంబర్ 36లోని ప్రభుత్వ భూమిలో కొందరు గుర్తుతెలియని వ్యక్తులు ప్రయత్నాలు చేస్తున్నారని, వారిపై చర్యలు తీసుకోవాలని మండల రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ రాంబాబు చందానగర్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసుకుని పోలీసులు దర్యాప్తు చేస్తున్నారని పేర్కొన్నారు.



మూసాపేటలోని ఎన్టీఆర్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు



పీవీనగర్‌లోని ఎన్టీఆర్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే గాంధీ



వివేకానందనగర్‌కాలనీలో నివాళులర్పిస్తున్న టీడీపీ రాష్ట్ర నాయకుడు పాతూరి వెంకట్రావ్, తదితరులు



మోతీనగర్‌లోని ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న బండి రమేష్, తదితరులు

# ఎన్టీఆర్‌ను తెలుగు సమాజం మరువదు



చందానగర్‌లో ఎన్టీఆర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పిస్తున్న నియోజకవర్గ ఇన్‌చార్జీ కట్ట వెంకటేష్‌గౌడ్

**కూకట్‌పల్లి/కుత్బుల్లాపూర్/శేరిలింగంపల్లి జోన్ బృందం, జనవరి 18 (ఆంధ్రజ్యోతి):** కూకట్‌పల్లి, కుత్బుల్లాపూర్, శేరిలింగంపల్లి జోన్ పరిధిలో టీడీపీ వ్యవస్థాపక అధ్యక్షులు, మాజీ ముఖ్యమంత్రి ఎన్టీఆర్ వర్ధంతి సందర్భంగా ఆయన విగ్రహానికి, చిత్రపటానికి ఎమ్మెల్యేలు మాధవరం కృష్ణారావు, ఆరెకపూడి గాంధీ, పలువురు ప్రజాప్రతినిధులు నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేలు మాట్లాడుతూ.. ఎన్టీఆర్ తెలుగు సమాజాభివృద్ధికి చేసిన కృషి మరువలేనిదని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎన్టీఆర్ అభిమానులు, టీడీపీ కార్యకర్తలు పాల్గొన్నారు.



హుడామయూరినగర్‌లో ఎన్టీఆర్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న జగదీశ్వర్‌గౌడ్, తదితరులు



కొంపల్లి మున్సిపల్‌లోని ఎన్టీఆర్ విగ్రహానికి టీడీపీ నాయకులు గోపి, సూర్య కిరణ్, జావీద్, వేణు, అక్బర్, భాస్కర్, రాజు, నవీన్‌లు నివాళులు అర్పించారు

## సోలార్‌తో విద్యుత్తును ఆదా చేయొచ్చు

- ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు



సోలార్ పనులను పరిశీలించి వివరాలు అడిగి తెలుసుకుంటున్న ఎమ్మెల్యే కృష్ణారావు

**ఓల్డుబోయినపల్లి, జనవరి 18(ఆంధ్రజ్యోతి):** సోలార్‌తో విద్యుత్తును ఆదా చేయవచ్చునని కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు అన్నారు. గురువారం ఉదయం ఓల్డుబోయినపల్లి డివిజన్ పరిధి హస్మత్‌పేట్‌లో ఉన్న సిరాజుల్ ఉలూమ్ మదర్సా మజీద్‌లో ఏర్పాటు చేస్తున్న సోలార్ పవర్ పనులను స్థానిక కార్పొరేటర్ ముద్దం నర్సింహ్మాయాదవ్‌తో కలిసి పర్యవేక్షించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. సోలార్ పవర్ ఏర్పాటు చేసుకుంటే ప్రభుత్వం నుంచి సబ్సిడీ కూడా లభిస్తుందదని అన్నారు. మదర్సాలో చేపట్టిన సోలార్ పవర్ పనులను తొందరగా పూర్తి చేయాలని సిబ్బందికి సూచించారు. కార్యక్రమంలో సీనియర్ నాయకులు మక్కల నర్సింగ్‌రావు, సయ్యద్ ఎజాజ్, ఓల్డుబోయినపల్లి డివిజన్ బీఆర్ఎస్ అధ్యక్షుడు ఇర్ఫాన్, కార్యదర్శి మేకల హరినాథ్, జహంగీర్, తదితరులు పాల్గొన్నారు.

## విజయంతో మరింత బాధ్యత పెరిగింది

- ఎమ్మెల్యే కేపీ వివేకానంద్



కృతజ్ఞత యాత్రలో ఎమ్మెల్యే కేపీ వివేకానంద్

**గాజులరామారం, జనవరి 18(ఆంధ్రజ్యోతి):** కుత్బుల్లాపూర్ నియోజకవర్గ ప్రజలు అందించిన అఖండ విజయంతో మరింత బాధ్యత పెరిగిందని ఎమ్మెల్యే కేపీ వివేకానంద్ అన్నారు. గాజులరామారం డివిజన్‌లోని పలు బస్తీల్లో కార్పొరేటర్ రావుల శేషగిరి, నాయకులతో కలిసి కృతజ్ఞత యాత్ర చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ. తొమ్మిదేళ్లలో చేసిన అభివృద్ధి, సంక్షేమ పథకాలను దృష్టిలో ఉంచుకొని రాష్ట్రంలోనే అత్యధిక మెజార్టీతో ఎమ్మెల్యేగా గెలిపించినందుకు ప్రతీ ఒక్కరికి పేరుపేరున ధన్యవాదాలన్నారు. నియోజకవర్గాన్ని రాబోయే రోజుల్లో సంక్షేమం, అభివృద్ధిలో రాష్ట్రంలోనే నెంబర్‌వన్‌గా తీర్చి దిద్దుతామన్నారు. ఈ కార్యక్రమంలో డివిజన్ నాయకులు, మహిళలు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## లేని తహసీల్దార్ పేరుతో కులధ్రువపత్రం

- డబుల్ బెడ్‌రూం కోసం ఫోర్జరీ చేసిన మహిళ
- తప్పును సరిదిద్దేందుకు జత చేసి మరోసారి దరఖాస్తు
- పోలీసులకు తహసీల్దార్ ఫిర్యాదు

**మదీన, జనవరి 18 (ఆంధ్రజ్యోతి):** రాష్ట్ర ప్రభుత్వం పేదలకు అందించే డబుల్ బెడ్ రూమ్ కోసం ఓ మహిళ నకిలీ కుల ధ్రువీకరణ పత్రం పొందినట్లు బహదూర్‌పురా మండల కార్యాలయం అధికారులు గుర్తించారు. అసలు లేని తహసీల్దార్ పేరుతో ధ్రువీకరణ పత్రం జారీ కావడంపై ఆశ్చర్యానికి గురయ్యారు.

దివాన్‌దేవిడి ప్రాంతానికి చెందిన శేఖర్ భార్య మంజుల(36)కు అబ్దుల్లాపూర్‌మెట్‌లో ప్రభుత్వ డబుల్ బెడ్‌రూమ్ మంజూరైంది. 2023 అక్టోబర్ 13వ తేదీన బహదూర్‌పురా మండల అధికారులు ఎస్సీ మాదిగ కులానికి చెందినట్లుగా జారీ చేసినట్లు కుల ధ్రువీకరణ పత్రం పొందింది. ఇల్లు అప్పగించేందుకు బల్దియా అధికారులు పత్రంలోని తప్పులను సరిదిద్ది కొత్తగా కావాలని సూచించారు. సదరు మహిళ అప్పటికే పొందిన కుల ధ్రువీకరణ పత్రాన్ని జత చేస్తూ మీ-సేవలో దరఖాస్తు చేసుకుంది. గురువారం దరఖాస్తును పరిశీలించిన తహసీల్దార్ చంద్రశేఖర్ షాక్‌కు గురయ్యారు. జారీ చేసిన సర్టిఫికెట్‌పై తహసీల్దార్ పేరు జానకిగా ఉంది. అసలు జానకి పేరుతో ఏ తహసీల్దార్ లేకపోవడంతో ధ్రువీకరణ పత్రాన్ని ఎలా పొందావని మహిళను అధికారులు ప్రశ్నించారు. తన భర్త తెచ్చాడని, నూర్‌ఖాన్ బజార్‌లోని ఓ మీ-సేవ సెంటర్ నిర్వాహకులు ఇప్పించారని చెప్పింది. విస్మయానికి గురైన తహసీల్దార్ పోలీసులకు ఫిర్యాదు చేసేందుకు సిద్ధమయ్యారు. ఇంకా ఎన్ని ఫోర్జరీ సర్టిఫికెట్లు జారీ అయ్యాయి. మీ-సేవ సెంటర్ నిర్వాహకుడి పాత్ర ఏంటి అనే వివరాలు పోలీసు దర్యాప్తులో తేలుతాయని బహదూర్‌పురా తహసీల్దార్ చంద్రశేఖర్ తెలిపారు.

## డాక్టర్ ఇంట్లో ప్రమాదకర మత్తు ఇంజక్షన్లు

- పోలీసుల దాడుల్లో స్వాధీనం

**రాజేంద్రనగర్, జనవరి 18 (ఆంధ్రజ్యోతి):** తెలంగాణ నార్కొటిక్ బ్యూరో, రాజేంద్రనగర్ ఎస్ఓటీ, రాజేంద్రనగర్ పోలీసులు గురువారం సంయుక్తంగా ఆసిఫ్‌నగర్‌లోని ఓ ఇంటిపై దాడులు నిర్వహించి అధిక మత్తునిచ్చే 57 ఇంజక్షన్లు స్వాధీనం చేసుకున్నారు. వారు తెలిపిన వివరాల ప్రకారం.. ఆసిఫ్‌నగర్‌లో నివాసం ఉంటున్న డాక్టర్ అశన్ ముస్తాఫా ఖాన్ ఓ ఆస్పత్రిలో అనస్తీషియన్. సర్జరీల సందర్భంగా మత్తు కోసం ఇచ్చే ఫెంటానిల్ మత్తు ఇంజక్షన్‌లను బయట మార్కెట్‌లో రూ. 17,500కు విక్రయిస్తున్నాడు. ఇవి హెరాయిన్ కంటే 50 శాతం ఎక్కువ, మార్ఫిన్ కంటే మరింత ఎక్కువ ప్రమాదకరమని పోలీసులు తెలిపారు. యాప్ ద్వారా బయట వ్యక్తులకు డాక్టర్ అశన్ ముస్తాఫా ఖాన్ విక్రయిస్తున్నట్లు తెలుసుకున్న పోలీసులు నిఘా పెట్టారు. ప్రతీ రోజు ఓ డెలివరీ యాప్ పార్సిల్ ద్వారా విక్రయిస్తున్నట్లు గుర్తించారు. గురువారం అతడి ఇంటిపై దాడి చేయగా డాక్టర్ కువైట్ పారిపోయినట్లు గుర్తించారు.

అతడి భార్య లుబ్నా నజీబ్ ఖాన్‌ను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఆమె నుంచి 57 మత్తు ఇంజక్షన్లు, రెండు సెల్‌ఫోన్‌లు, రూ. 6లక్షల నగదు స్వాధీనం చేసుకున్నారు. డాక్టర్ వస్తే అతడు ఎవరెవరికి మత్తు ఇంజక్షన్‌లు విక్రయిస్తున్నాడనే వివరాలు తెలిసే అవకాశం ఉందని పోలీసులు తెలిపారు.

## గురుకుల పాఠశాలలో దరఖాస్తుల ఆహ్వానం

**హైదర్‌నగర్, జనవరి 18 (ఆంధ్రజ్యోతి):** హైదర్‌నగర్‌లోని బాలానగర్ తెలంగాణ గురుకుల పాఠశాలలో 2024-25 విద్యాసంవత్సరానికి పాఠశాల, కళాశాలలో అడ్మిషన్ల కోసం దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ జితేందర్ తెలిపారు. జనవరి 18నుంచి ఫిబ్రవరి 6వరకు ఆన్‌లైన్ దరఖాస్తులు స్వీకరిస్తున్నామని పేర్కొన్నారు. ఆసక్తి గల విద్యార్థులు దరఖాస్తులు చేసుకోవాలని మరిన్ని వివరాలకు 8297094093, 7331170802 సంప్రదించాలని తెలిపారు.

## మైనార్టీ బాలికల పాఠశాల, కళాశాల దరఖాస్తుల ఆహ్వానం

**మియాపూర్, జనవరి 18 (ఆంధ్రజ్యోతి):** మియాపూర్ గోకుల్‌ప్లాట్స్‌లోని జూబ్లీహిల్స్ మైనార్టీ బాలికల పాఠశాల, కళాశాలలో 2024-25 విద్యాసంవత్సరానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ నాగస్వర్ణ తెలిపారు. ఆసక్తిగల విద్యార్థులు తమ సర్టిఫికెట్లతో పాఠశాల, కళాశాలకు వచ్చి దరఖాస్తు చేసుకోవచ్చున్నారు. 5వ తరగతిలో మైనార్టీ, నాన్‌మైనార్టీ విద్యార్థులు, ఇంటర్ మొదటి సంవత్సరంలో (సీఈసీ, ఎంఈసీ) మైనార్టీలకు ( 30సీట్లు), నాన్‌మైనార్టీలకు (10సీట్లు) ఉన్నాయని, అదేవిధంగా 6,7,8 తరగతులకు ముస్లిం మైనార్టీ విద్యార్థులు మాత్రమే దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. మరిన్ని వివరాలకు 9703296221, 7995057898 సంప్రదించాలని పేర్కొన్నారు.

## ట్రాఫిక్ రద్దీ సమయాల్లో భారీ వాహనాలు నిషిద్ధం

**రాయదుర్గం, జనవరి18(ఆంధ్రజ్యోతి):** ట్రాఫిక్ రద్దీ సమయాల్లో భారీ వాహనాల రాకపోకలను నిషేదిస్తున్నట్లు సైబరాబాద్ ట్రాఫిక్ డీసీపీ డి.వి. శ్రీనివాస్ రావు తెలిపారు. గురువారం విలేఖరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. సైబరాబాద్ కమిషనరేట్ పరిధిలో పెరుగుతున్న ట్రాఫిక్ రద్దీని తగ్గించేందుకు కొన్ని నిబంధనలు కొత్తగా అమలు చేస్తున్నట్లు పేర్కొన్నారు. అన్ని భారీ వాహనాలను ఫ్లైఓవర్లపై నుంచి వెళ్లకుండ నిషేదించామన్నారు. భారీ వాహనాలు, మీడియం మోటారు వాహనాలు(డీసీఎం, వాటర్ ట్యాంకర్లు, ఆర్ఎంసి, జేసీబీ, ట్రాక్టర్ వంటి వాహనాలు ఉదయం 7.30 నుంచి 11.30 గంటల వరకు, సాయంత్రం 4 గంటల నుంచి 10.30 గంటల వరకు రోడ్డుపై నిసేదిస్తున్నట్లు తెలిపారు. నిర్మాణ రంగానికి సంబంధించిన వాహనాలు, డిమాలిషన్ వ్యర్థాలను తరలించే వాహనాలను ఉదయం 6 నుంచి రాత్రి 10.30 గంటల వరకు రోడ్లపై నిషేదిస్తున్నట్లు పేర్కొన్నారు.



ఆధారాలు సేకరిస్తున్న క్లూస్‌టీమ్

## ఏటీఎంలో నగదు కాజేసేందుకు పయత్నించిన దొంగలు

**పేట్‌బషీరాబాద్, జనవరి 18(ఆంధ్రజ్యోతి):** ఏటీఎంలో దొంగలు నగదును కాజేసేందుకు ప్రయత్నించిన సంఘటన పేట్‌బషీరాబాద్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కొంపల్లి మున్సిపల్‌లోని దూలపల్లి రహదారి ప్రక్కన ఉన్న పంజాబ్ నేషనల్ బ్యాంక్ ఏటీఎంలో నగదును దోచుకోవడానికి దొంగలు ప్రయత్నం చేసి విఫలమయ్యారు. ఏటీఎంకు వచ్చే వినియోగదారులు మిషన్‌ను పగలకొట్టి ఉండడాన్ని గుర్తించి వారు బ్యాంక్ సిబ్బందికి సమాచారం అందించారు. సిబ్బంది పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఫిర్యాదు అందు కున్న క్రైమ్ డీఐ రాజు క్లూస్‌టీమ్‌తో సంఘటనా స్థలానికి చేరుకొని వివరాలను సేకరించారు. కేసునమోదు చేసుకున్న పోలీసులు సీసీ కెమెరాలను పరిశీలిస్తున్నారు. ఏటీఎంలో నగదు లేకపోవడంతో బ్యాంకు అధికారులు ఊపిరి పీల్చుకున్నారు.

## నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

**కూకట్‌పల్లి/కుత్బుల్లాపూర్/శేరిలింగంపల్లి, జనవరి 18 (ఆంధ్రజ్యోతి):** కూకట్‌పల్లి, కుత్బుల్లాపూర్, శేరిలింగంపల్లి నియోజకవర్గ పరిధిలోని విద్యుత్ సబ్‌స్టేషన్‌లలో మరమ్మతుల కారణంగా విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు అధికారులు తెలిపారు.

- మదీనగూడ 33/11 కేవీ విద్యుత్ ఫీడర్ పరిధిలో శుక్రవారం ఉదయం 10.30నుంచి 12.30గంటల వరకు విద్యుత్ ఉండదన్నారు. గోపన్‌పల్లి 33/11కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో మరమ్మతుల కారణంగా శుక్రవారం ఉదయం 10నుంచి మధ్యాహ్నం 12గంటల వరకు పలు ప్రాంతాల్లో విద్యుత్ ఉండదని ఏఈ వెంకట నారాయణరెడ్డి తెలిపారు.
- కేపీహెచ్‌బీ విద్యుత్ సెక్షన్ పరిధిలో చెట్ల కొమ్మల తొలగింపు కోసం శుక్రవారం విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏఈ శంకర్ తెలిపారు. మధ్యాహ్నం 1 నుంచి 3 గంటల వరకు కరెంట్ ఉండదని పేర్కొన్నారు.
- 11కేవీ సంగీత్‌నగర్, హుడాట్రక్ పార్కు సబ్‌స్టేషన్ల పరిధిలో మరమ్మతుల వల్ల శుక్రవారం ఉదయం 10గంటల నుంచి మధ్యాహ్నం 12వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏఈ చైతన్య తెలిపారు.
- శంశిగుడా, ఎన్టీఆర్‌నగర్ సబ్ స్టేషన్ 33/11కేవీలో మరామ్మతుల కారణంగా గాజులరామారం డివిజన్‌లో మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ నిలిపి వేస్తున్నట్లు ఏఈ చైతన్య భార్గవ్ ఒక ప్రకటనలో తెలిపారు.
- బోయినపల్లి 11 కేవి ఫీడర్ పరిధిలో మరమ్మత్తుల కారణంగా విద్యుత్ సరఫరాను ఉదయం 10 నుంచి 12 గంటల వరకు, మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 4 నిలిపి వేస్తున్నట్లు సీబీడీ ఏడిఈ శ్రీనివాస్ రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు.

## రాజకీయ నాయకులతో ఎన్నికల అధికారి సమావేశం



మాట్లాడుతున్న ఎన్నికల అధికారి రజనీకాంత్‌రెడ్డి

**గచ్చిబౌలి, జనవరి 18 (ఆంధ్రజ్యోతి:** శేరిలింగంపల్లి నియోజకవర్గం ఓటరు లిస్టులో అవకతవకలకు తావ్వులేకుండా చేసేందుకు అన్నీ రాజకీయ పార్టీలు సహకరించాలని శేరిలింగంపల్లి ఇవిఆర్వో (ఎన్నికల అధికారి) రజనికాంత్‌రెడ్డి కోరారు. గురువారం సాయంత్రం శేరిలింగంపల్లి సర్కిల్ కార్యాలయంలోని తన చాంబర్‌లో అన్ని రాజకీయ పార్టీల నాయకులతో సమావేశం ఏర్పాటు చేశారు. ఓటు నమోదు చేసుకునేందుకు ఈనెల 22వరకు అవకాశం ఉందని, 18 సంవత్సరాలు నిండిన వారు అర్హులని అన్నారు. ఈనెల 20, 21 శని, ఆదివారాల్లో నియోజకవర్గంలోని అన్ని బూత్‌లో ఓటరులిస్టు అందుబాటులో ఉంటుందని, అధికారులంతా అందుబాటులో ఉంటారని తెలిపారు. కార్యక్రమంలో అన్ని పార్టీల నాయకులు పాల్గొన్నారు.

## నేడు గిరిజన సంస్కృతి పరిరక్షణపై సదస్సు

**హైదరాబాద్ సిటీ, జనవరి 18 (ఆంధ్రజ్యోతి):** ఆద్యకళ మ్యూజియం ఆధ్వర్యంలో శుక్రవారం ఉదయం 10 గంటలకు నాంపల్లి, తెలుగు వర్సిటీలోని సమావేశ మందిరంలో 'జానపద, గిరిజన కళలు, సంస్కృతి-అధ్యయనం-పరిరక్షణ' అంశంపై సదస్సు నిర్వహించనున్నట్లు ఆచార్య జయధీర్ తిరుమలరావు తెలిపారు. సదస్సులో మంత్రులు సీతక్క, జూపల్లి కృష్ణారావు, ప్రొఫెసర్ కోదండరాం, ఆంధ్రజ్యోతి ఎడిటర్ కె.శ్రీనివాస్ తదితరులు పాల్గొననున్నట్లు నిర్వాహకులు పేర్కొన్నారు.

## నేటి నుంచి చిత్తారమ్మ జాతర



**షాపూర్‌నగర్, జనవరి 18(ఆంధ్రజ్యోతి):** జనవరి 19 శుక్రవారం నుంచి గాజులరామారం శ్రీచిత్తారమ్మ జాతర నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ ఛైర్మన్ కూన అంతయ్యగౌడ్ తెలిపారు. గురువారం ఆలయ ప్రాంగణంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. జాతరకు వచ్చే భక్తుల సౌకర్యార్థం ఇప్పటికే అన్ని ఏర్పాట్లు చేశామన్నారు. మరుగుదొడ్లు, వైద్యసేవలు, జీడిమెట్ల పోలీసుల ఆధ్వర్యంలో నిరంతర నిఘాను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈనెల 19 నుంచి 27వ వరకు జాతర నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. భక్తులు అధిక సంఖ్యలో విచ్చేసి అమ్మవారి ఆశీర్వదానికి పాత్రులు కాగలరని కోరారు. సమావేశంలో ఆలయ కమిటీ ప్రధాన కార్యదర్శి రాచకొండ బాల్‌రాజ్, తదితరులు పాల్గొన్నారు.

## ముగ్గురు నిందితుల అరెస్ట్

**దుండిగల్, జనవరి 18(ఆంధ్రజ్యోతి):** పలు ఇళ్లలో చోరీలకు పాల్పడి తప్పించుకు తిరుగుతున్న ముగ్గురు ముఠా సభ్యులను బాచుపల్లి పోలీస్‌స్టేషన్ క్రైమ్ టీమ్ సభ్యులు అరెస్ట్ చేసి గురువారం రిమాండ్‌కు తరలించారు. వీరంతా సూరారం ప్రాంతంలో సుందర్‌నగర్‌లో నివాసం ఉంటున్న బేరంగుల రవి (21), బేరంగుల భరత్ (20), సూరారం సంతోష్ నగర్‌లో నివాసం ఉంటున్న తన్నీరు సూరి (19). ఈ ముగ్గురు ఇళ్లలో దొంగతనాలకు పాల్పడే ముఠాగా ఏర్పడ్డారు. పోలీసులు వారిని విచారించగా వారు పాల్పడిన నేరాలను అంగీకరించారు. డిఎస్ఐ యాదగిరి అతని బృందాన్ని బాచుపల్లి పోలీస్ ఉన్నతాధికారులు అభినందించారు. ఈ మేరకు కేసు నమోదుకొని నిందుతులను రిమాండ్‌కు తరలించారు.

### మరో కేసులో చైన్ స్నాచర్

**కూకట్‌పల్లి, జనవరి 18 (ఆంధ్రజ్యోతి):** మహిళ మెడలోనుంచి బంగారు గొలుసు దోచేసిన ఘటన కూకట్‌పల్లిలో బుధవారం జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కూకట్‌పల్లి వివేకానందనగర్‌లో గుర్తు తెలియని వ్యకి బైకుపై వచ్చి లక్ష్మి మెడలో నుంచి బంగారు గొలుసు లాగేసుకుని పారిపోయాడు. సదరు మహిళ కూకట్‌పల్లి పీఎస్‌లో ఫిర్యాదు చేయగా సీసీటీవీ ఫుటేజీ ఆధారంగా స్నాచరును గుర్తించి అదుపులోకి తీసుకుని రిమాండ్‌కు తరలించారు. మెదక్ జిల్లాకు చెందిన నీరుడి ప్రభాకర్ (25)ను నిందితునిగా గుర్తించారు. ప్రభాకర్ వివేకానంద నగర్‌లోనే హాస్టల్‌లో ఉంటూ డెలివరీ బాయ్‌గా పని చేసేవాడు.